ఇంట్లో నుంచి వెళ్లిపో. ముందు పెళ్లి రద్దు అవుతుంది. తర్వాత సంగతి చూద్దాం'

'నువ్వు మతుండే మాట్లాడుతున్నావా? అప్పుడు మా కుటుంబం పరువు, నా భవిష్యత్తూ ఏమవుతుందో ఆలోచించావా? అయినా అనంత్ 'గే' అని ఏ ఆధారంతో చెప్పగలవు?'

'గే.. కాకుంటే నపుంసకుడు!'

'లాస్యా!' నెత్తి మీద పిడుగుపడినట్లు, చివరి మాటల్లా ఉన్నాయి.

'నీకు సమయం లేదు. అయినా పర్వాలేదంటే నీ ఇష్టం. నీ జీవితం నీది. ఓ 'గే'తో లేదా 'నపుంసకుడి'తో జీవితాంతం బాధలు పడతావా? రెక్కలు విప్పుకొని స్వేచ్ఛగా విహరిస్తావా! నిర్ణయం నీది. ఇప్పటికే నాకు పది మిస్స్‌డ్ కాల్స్ ఉన్నాయి. బై!' అని కట్ చేసింది.

పరిమళ ఇప్పటివరకు ఇలాంటి కఠినమైన సందర్భాన్ని ఎదుర్కోలేదు. లాస్యతోపాటు తన మిత్రబృందం అల్ట్రా మోడ్రన్ అమ్మాయిలు. సిగరెట్లు తాగుతారు. వైన్ నుండి హాట్‌డ్రింక్స్ తీసుకునేవారున్నారు. ఆడా – మగా సంబంధాల గురించి వారు మాట్లాడుకునే మాటలు వింటే.. పాతతరం వారికి గుండెలు బద్దలైపోతాయి. వారిలో లిబరల్‌గా ఉండేది తనే. కొత్తలో బలవంతం చేసేవారు. అప్పుడు స్పష్టంగా చెప్పింది.

'నేను బెంగళూరు రావటానికి కారణం చదువుకోవటానికి. ఇక్కడికి వచ్చేముందు నాకు చాలామంది చెప్పారు. ఆడపిల్లలు కూడా డ్రగ్స్ తీసుకుంటున్నారని. మా అమ్మానాన్నలు ఒకేమాట చెప్పారు. 'నీకు చదువా? ప్రేమా? అక్కడ పిల్లల గురించి అనేకం వింటున్నాం. మేం ఆంధ్రాలో ఉండి నువ్వు అక్కడ ఏం చేస్తుంటావో తెలుసుకోలేం. బతుకు నీది. బంధం నీది. దాన్ని చక్కగా మలుచుకుంటావో.. కుక్కలు చింపిన విస్తరిలా చేసుకుంటావో నీ ఇష్టం!' అన్నారు. అందుకని నన్ను మీరు బలవంతం చేయొద్దు'.

'వ్వావ్.. పరిమళాలు వెదజల్లావ్. ఓకే.. నీ జోలికి మేం రావటం లేదు. కనీసం నీ పెళ్లికైనా పిలుస్తావా?' అందో అమ్మాయి.

'నేనూ అదే అడుగుతున్నాను.'

'పరీ.. నేను మగవాళ్లని చేసుకోను. యామే లెస్బియన్' అంది.

మరొకామె..

'నేను సింగిల్ మదర్‌గా ఉంటా!' అంది.

ఆశ్చర్యంగా చూస్తుంటే...

'పరిపరి విధములుగా ఆలోచించకు. ఇవన్నీ ఇప్పుడు చట్టం ఆమోదించినవి' అన్నారు మరొకరు.

అవన్నీ గుర్తుకు వస్తున్నాయి. లాస్య హాస్యం కోసం ఇదంతా చేయదు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

ఏదో ఒక ఆధారం ఉంటుంది. అయినా తను ఎంత సంప్రదాయబద్ధంగా ఉన్నా.. 'గే' తో, 'నపుంసకుడి'తో ఎలా ప్రయాణం చేయగలదు! అలా అని ఇందులో వాస్తవం తెలియకుండా ఎదుటివారిని ఏ రకంగా గాయపరచగలదు!

ఎవరి జీవితం వారిదే. అది ఓ రెండు కుటుంబాలతో, సమాజంతో కూడా ముడిపడి ఉంది కదా అనుకుంది. ఎటూ తేల్చుకోలేక మథనపడింది. అప్పుడు తనకు తనే సమాధానం చెప్పుకొంది.

'అనంత్ నిజంగానే ఆ రెండిటిలో ఏ ఒక్కటి అయినా ఆ ప్రయాణం సాగదు. అతని నుండి విడిపోయే అవకాశాన్ని చట్టమే కల్పించింది. తను ఏ నిర్ణయం తీసుకున్నా బాధే. అందుకని అదేదో నేనే తాత్కాలికంగా అనుభవిస్తాను. ఈ వేదనను రెండు కుటుంబాలకు పంచను' అనుకుంది.

పెళ్లి పీటల మీద కూర్చున్నా ఈ ఆలోచనలు పరిమళని అంటి పెట్టుకునే ఉన్నాయి. తనలోని ఆందోళనను కప్పిపుచ్చటానికి విశ్వ ప్రయత్నం చేసింది. ఆమెకు సాధ్యం కాలేదు.

''అమ్మాయీ'' అని అమ్మ పిలవటంతో ఆలోచనలకు తెరపడింది.

* * *

తిరిగి అదే సందిగ్ధత!

శోభనం గురించి చెప్పినప్పుడు ఓ నెల రోజులు వాయిదా వేశాడు అనంత్. ఇంట్లో వారికి అదేమంత పట్టించుకోదగ్గ విషయం అనిపించలేదు. అనంత్‌కి చెందిన ఓ ప్రాజెక్ట్ చివరి దశలో ఉంది. దానికి అతను లీడర్. అది సమయానికి అందించాలి. విజయవంతంగా పూర్తి అయిన అనంత్‌కి ప్రమోషన్లు ఉంటాయి.

అతనిప్పుడు ముంబైలో పని చేస్తున్నాడు. అక్కడికి వెళ్లే ముందు పరిమళను కలుసుకున్నాడు. ఇద్దరి మధ్య కొంతసేపు మాటలు లేవు.

''నేను ముంబై వెళ్తున్నాను పరిమళగారూ! మనకి పెళ్లయిన వెంటనే ఇలా వెళ్లటం కాస్త నిరుత్సాహంగా ఉంటుందని నాకు తెలుసు. అసలు ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాకే పెళ్లి చేసుకుంటానని అమ్మా నాన్నలకు ముందే చెప్పాను. మళ్లీ ముహూర్తాలు లేవని ఒప్పించారు. అందుకని తప్పలేదు''.

''అంతేనా?'' అంది పరిమళ.

ఆశ్చర్యంగా చూశాడు. ఆ తర్వాత అడిగాడు..

''ఎందుకలా అడిగారు?''

''నా ఉద్దేశం మీ అమ్మానాన్నల కోసమే ఈ పెళ్లి చేసుకున్నారా అని''

''అది కూడా ఉంది. నాకు మీరు నచ్చారు. ఇది కూడా కారణం''

చిన్నగా తలూపింది.

''మీరు కూడా..'' అని ఆగాడు.

''అడగండి'' అంది పరిమళ.

''మీ అమ్మా నాన్నల కోసం చేసుకున్నారా ఈ పెళ్లిని?'' అతను పరిమళని నిశితంగా చూస్తూ అడిగాడు.

పెళ్లిరోజు ఆమె వదనం ఇంకా గుర్తుకు వస్తూనే ఉంది.

''వారి కోసం.. నా కోసం కూడా'' అంది తనూ అతని కళ్లల్లోకి చూస్తూ.

''సంతోషం! మనం తొందరలో ప్రశాంతంగా మాట్లాడుకుందాం. మీకు కొన్ని విషయాలు చెప్పాలి. ఇప్పుడు నా మనసంతా ప్రాజెక్ట్ మీదే ఉంది''